విద్యుత్ శాఖకు రూ. 47.79 లక్షల నష్టం

హనుమకొండ పరిధిలో రూ. 25 లక్షలు, వరంగల్ పరిధిలో రూ. 22.79 లక్షలు

విరిగిన స్తంభాన్ని సరిచేయిస్తున్న ఎస్ఈ మధుసూదన్‌రావు

హనుమకొండ, మే 7: ఈ నెల 5న వీచిన గాలివాన వల్ల హనుమకొండ, వరంగల్ సర్కిళ్ల పరిధిలో మొత్తం రూ. 47.79 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. స్తంభాలు విరిగి పోవడం, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు. హనుమకొండ సర్కిల్‌లో 97 పోల్స్, 3 ట్రాన్స్‌ఫార్మర్లు, వరంగల్ సర్కిల్‌లో 293 పోల్స్, 4.28 కిలో మీటర్ల కండక్టర్, 6 ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నట్లు వెల్లడించారు. కాగా, హనుమకొండ సర్కిల్‌లో సుమారు రూ. 25 లక్షలు, వరంగల్ సర్కిల్‌లో రూ. 22.79 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేసినట్లు ఆయా సర్కిల్ ఎస్ఈలు మధుసూదన్, గౌతమ్ రెడ్డి తెలిపారు. విద్యుత్ సరఫరాపై నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సిబ్బంది, అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తున్నామని హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు. విద్యుత్ సమస్యలుంటే వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1912, 18004250028కు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చని ఎస్ఈ సూచించారు.

డంపింగ్ యార్డు కాదు.. డ్రైనేజీ

- చెత్తాచెదారంతో పేరుకుపోయిన కాల్వ
- ఎక్కడికక్కడే నిలిచిన మురుగునీరు
- దుర్వాసనతో కాలనీవాసుల అవస్థలు

సాకరాశికుంట నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కరీమాబాద్, మే 7: వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని సాకరాశికుంట ప్రధాన నాలా డంపింగ్ యార్డును తలపిస్తున్నది. నాలా నిండా చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో నాలాను ఆనుకుని ఉన్న కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, దోమలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖిలావరంగల్, రంగశాయిపేట, శంభునిపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాన, మురుగునీరు సాకరాశికుంట నాలా ద్వారా వెళ్తుంది. నాలాను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శుభ్రం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీని పరిస్థితి ఇలా ఉంటే.. వరంగల్ 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి రోడ్లపై ప్రవహిస్తున్నది. దీంతో దుర్గంధం భరించలేకపోతున్నామని కాలనీవాసులు, బాటసారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీనగర్‌లోని కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తున్న గౌతమ్

నిరుపేదలను ఎంపిక చేయాలి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్

వరంగల్, మే 7: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, నిబంధనలు, పారదర్శకత పాటించాలని రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ సూచించారు. హనుమకొండలోని కుడా కార్యాలయంలో బుధవారం ఆయన హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదతో కలిసి సమీక్షించారు. గ్రామాలు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో వచ్చిన దరఖాస్తులు, అర్హులు, అనర్హుల గుర్తింపు వివరాలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధికారుల వద్ద ఉన్న సమాచారంతో క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేసిన తర్వాతే నియోజకవర్గాల నోడల్ అధికారుల ద్వారా జాబితాను కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని ఆయన ఆదేశించారు. పైలట్ గ్రామాల్లో ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించని వారి స్థానంతో ఇతర గ్రామాల వారిని ఎంపిక చేస్తామన్నారు. వర్ధన్నపేట మండలంలో వేగంగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసినట్లు నోడల్ అధికారి చెప్పడంతో హౌసింగ్ ఎండీ అభినందించారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించిన ఏఈలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. సమావేశానికి ముందు గ్రేటర్ పరిధిలోని సోమిడి, వడ్డేపల్లి, దేశాయిపేట ప్రాంతాల్లో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి హౌసింగ్ ఎండీ వీపీ గౌతమ్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఇంటర్‌లో అడ్మిషన్లు పెంచాలి: కలెక్టర్

ఖిలావరంగల్, మే 7: జిల్లాలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పెంచేలా కాన్వాసింగ్ చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లో జిల్లా ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమీక్షించారు. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఇంటర్ పరీక్షల ఫలితాల ప్రకారం తక్కువ శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాలపై దృష్టి సారించాలన్నారు. కారణాలను అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల వివరాలు తెలుసుకొని, భవిష్యత్‌లో వారు సరైన కోర్సులను ఎంపిక చేసుకునేలా అవగాహన క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో డీఐఈవో డాక్టర్ శ్రీధర్‌సుమన్, డీఈవో అధికారి జ్ఞానేశ్వర్, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

'రైతులను ఇబ్బంది పెడుతున్న అధికారులు'

ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొంతమంది అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారదను కలిసి వినతిపత్రం అందజేశారు. ధాన్యాన్ని సెంటర్‌కు తీసుకొచ్చిన తర్వాత సుమారు 10 రోజులపాటు కాంటాలు నిర్వహించకపోవడంతో రైతులు నిరీక్షిస్తున్నారన్నారు. ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కూడా సమకూర్చడం లేదన్నారు. బస్తాలు కాంటాలు వేసిన తర్వాత మిల్లులో దిగుమతయ్యే వరకు తక్‌పట్టి ఇవ్వడం లేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, జెండా అంబయ్య, సిరుల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరంగల్ స్టేషన్‌రోడ్డులో వాసవీ కన్యకాపరమేశ్వరి శోభాయాత్రలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

భూ సమస్యలు లేని గ్రామాలను తయారు చేయాలి

సదస్సులో కలెక్టర్ సత్యశారద

రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట, మే 7: గ్రామాలను భూ సమస్యలు లేకుండా తయారు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మండలంలోని కట్రియాల, ఇల్లందలో భూ భారతిపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సదస్సులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన వర్ధన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటామన్నారు. వీలైనవి వెంటనే రెవెన్యూ కార్యాలయంలో పరిష్కరించడంతోపాటు మిగతా వాటిపై సమగ్రంగా విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ప్రధానంగా భూ రికార్డుల్లో తప్పులు సరిచేయడం, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, సర్వే నంబర్ తప్పులు, పాస్‌పుస్తకాలు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దులు నిర్ధారించేందుకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ ఇల్లంద వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, రైతులకు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, మార్కెటింగ్ జిల్లా అధికారి సురేఖ, ఆర్డీవో ఏవో రమేశ్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన నీటి ఎద్దడి నివారణ

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నల్లబెల్లి: బోల్లోనిపల్లెలో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నల్లబెల్లి, మే 7: ప్రజలకు తాగునీరు అందించడంలో అధికారుల అలసత్వంపై అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బోల్లోనిపల్లెలో రెండు నెలలుగా తాగునీరు సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'బోల్లోనిపల్లె వాసుల రాస్తారోకో' శీర్షికన నెల 7న నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ బుధవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో యుద్ధప్రాతిపదికన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో పాటు గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీవో నర్సింహమూర్తితో సమీక్షించారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ ప్రభావతి, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శ్రీవర్షిణి, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన

దుగ్గొండి: సకాలంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని రేఖంపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను బుధవారం ఆమె పరిశీలించారు. నిర్మాణంలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, ఎంపీడీవో లెక్కల అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి అశోక్‌రెడ్డి ఉన్నారు.

పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలి: మేయర్

వరంగల్, మే 7: ప్లానిటోరియం, కౌన్సిల్ హాల్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ప్లానిటోరియం, కౌన్సిల్ హాల్ పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లానిటోరియం పనులపై బిర్లా ప్లానిటోరియం టెక్నికల్ అధికారికి సూచనలు చేశారు.

కాంగ్రెస్ కార్యకర్తపై కేసు నమోదు

నల్లబెల్లి, మే 7: సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న కాంగ్రెస్ కార్యకర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. మండలంలోని ముచ్చింపుల గ్రామానికి చెందిన గుగులోత్ ఊక్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పని చేస్తున్నాడు. తనకు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇల్లు రాకుండా చేశారనే ఆరోపణతో కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో అధికార పార్టీతోపాటు కొంతమంది నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి అసభ్య పోస్టులు పెడుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆంగోత్ పూల్‌సింగ్‌తో పాలు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఊక్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ వెల్లడించారు.

జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

గిర్మాజీపేట, మే 7: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 3 నుంచి 13వ తేదీ ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లాలో ప్లాటినం జూబ్లీ హైస్కూల్-ఏ, బీ రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వివరాలను తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ నంబర్ 8919785739లో విద్యార్థులు సంప్రదించాలని సూచించారు.

పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

నల్లబెల్లి, మే 7: పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. మండలకేంద్రానికి చెందిన సముద్రాల లింగయ్య అంబర్, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నాడు. అతడు తన ఇంట్లో పొగాకు ఉత్పత్తులను నిల్వ చేసి, తన పాన్‌షాపులో విక్రయించడంతోపాటు మండలంలోని పలు కిరాణా షాపులకు అందిస్తున్నాడు. పక్కా సమాచారంతో అతడి నుంచి అంబర్, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని లింగయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-337056

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లను సత్వరమే జారీ చేయాలి: కమిషనర్

వరంగల్, మే 7: ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లను సత్వరమే జారీ చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 3500 దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్‌లను జారీ చేశామని అధికారులు కమిషనర్‌కు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి నోటీసులు అందజేయాలని ఆదేశించారు. సెల్లార్లలో నిర్మాణాలుంటే వెంటనే తొలగించాలన్నారు. ఎలక్ట్రికల్ డివైజ్‌లు తొలగించి మొదటి అంతస్తుల్లో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీఎస్ బీపాస్‌లో భవన నిర్మాణాల అనుమతులను నిర్దిష్ట గడువులోగా మంజూరు చేయాలని సూచించారు. ఇన్‌చార్జీ సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, రజిత, ఖలీల్ నస్రీన్, టీపీఎస్‌లు రోజారెడ్డి, సుమన, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టీకాల పంపిణీని పరిశీలిస్తున్న డాక్టర్ బాలకృష్ణ

పాడి పశువుల అభివృద్ధికి కృషి చేయాలి

నర్సంపేట, మే 7: పాడి పశువుల అభివృద్ధికి రైతులు కృషి చేయాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎం.బాలకృష్ణ కోరారు. పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పశువుల గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రైతులు విధిగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. నర్సంపేట ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో ఇప్పటి వరకు 261 గేదెలు, 98 ఎద్దులు, ఆవులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట పశు సంవర్ధక సహాయ సంచాలకుడు డాక్టర్ బీఎన్ రెడ్డి, భాంజీపేట పశువైద్యాధికారి డాక్టర్ ఎం.విద్యా, పశు వైద్య సహాయకుడు ఎండీ మాసు కబ్బాని, ఆఫీస్ సబార్డినేట్స్ రాజ్‌కుమార్, అన్వేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

నర్సంపేట, మే 7: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. మండలంలోని ఇటుకాలపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ నాయకులు బుధవారం పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. కుంటి సాకులతో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని కోరారు. నిబంధనలు పాటించని మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కన్నం వెంకన్న, కుసుంభ బాబురావు, మహ్మద్ రాజాసాబ్ ఉన్నారు.

ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ

పర్వతగిరి, మే 7: మండలకేంద్రంలోని దుగ్యాల సురేందర్‌రావు ఇంట్లోకి మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 13 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సురేందర్‌రావు కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్ ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు

వరంగల్‌చౌరస్తా, మే 7: వివిధ వైద్య అవసరాల కోసం వచ్చే రోగులు, పాదచారుల తప్పిక తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి అన్నారు. ఎంజీఎం హాస్పిటల్ క్యాజువాలిటీ విభాగం ఎదుట, ఐఎంఏ భవన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బుధవారం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్, ఐఎంఏ కార్యదర్శి అజిత్ మహ్మద్, ఐఎంఏ బిల్డింగ్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బందెల మోహన్‌రావు, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి, ఎంజీఎంహెచ్ ఆర్ఎంవో డాక్టర్ శశికుమార్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో కల్తీపై ఫిర్యాదు

రాయపర్తి, మే 7: పెట్రోల్ బంక్‌లో జరుగుతున్న కల్తీని అరికట్టి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రాయపర్తికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు బుధవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి ఫిర్యాదు చేశారు. మండలకేంద్రంలోని వినాయక పెట్రోల్ పంపులో పెట్రోలు, డీజిల్‌ను కల్తీ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో డాక్టర్ సంకినేని వెంకట్ మాదిగ, ఐత రాజు, పీరని రాజు ఉన్నారు.

కలెక్టరేట్‌లో లే అవుట్ సమావేశం

ఖిలావరంగల్, మే 7: కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన లేఅవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో మూడు లేఅవుట్ అనుమతుల కోసం ప్రతిపాదనలు రాగా, వాటిని కమిటీని నిబంధనల మేరకు పరిశీలించి అనుమతులు మంజూరు చేశారు.

సంగెం పీహెచ్‌సీ తనిఖీ

సంగెం, మే 7: సంగెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి: ఎర్రబెల్లి

బీఆర్ఎస్‌లోకి నరేశ్‌ను ఆహ్వానిస్తున్న దయాకర్‌రావు

రాయపర్తి/వర్ధన్నపేట, మే 7: బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్ అధ్యక్షతన బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మండలంలోని జయరాంతండా(కే)కు చెందిన లావుడ్యా నరేశ్ బీఆర్ఎస్‌లో చేరగా, ఎర్రబెల్లి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ నాయకులు గుడిపూడి గోపాల్‌రావు, పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, గారె నర్సయ్య, కర్ర రవీందర్‌రెడ్డి, కుందూరు రాంచంద్రారెడ్డి, లేతాకుల రంగారెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, అయిత రాంచందర్, కుందూరు యాదగిరిరెడ్డి, భూక్యా భద్రూనాయక్, సుధాకర్, రామ్‌యాదవ్, అశోక్‌కుమార్, సింహాద్రి, ఉప్పలయ్య, వాసునాయక్, జయశ్రీ, స్వామి, వసుందర్‌నాయక్ పాల్గొన్నారు. వర్ధన్నపేటలో సిలువేరు కుమార స్వామి, మధుసూదన్ పాల్గొన్నారు.

నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉద్యాన శాఖ అధికారి అరుణ

వర్ధన్నపేట: రైతులకు నీటి యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న అధికారులు

వర్ధన్నపేట/దుగ్గొండి/చెన్నారావుపేట/సంగెం మే 7: ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసిన రైతులు మొక్కల సంరక్షణకు విధిగా నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని వర్ధన్నపేట డివిజన్ ఉద్యాన శాఖ అధికారి అరుణ సూచించారు. వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామంలో కరిమిళ్ల వెంకటేశ్వర్‌రావు సాగు చేసిన ఆయిల్ పామ్ తోట ను ఉద్యాన శాఖ అధికారులు, రామ్ చరణ్ ఆయి ల్ ఇండస్ట్రీ ప్రతినిధులు బుధవారం సందర్శించి రైతులకు సూచనలు చేశారు. ఆయిల్‌పామ్ రైతు ల కోసం ఉద్యాన శాఖ 80 శాతం సబ్సిడీతో డ్రిప్ అందిస్తుందన్నారు. రైతులు డ్రిప్ పద్ధతిలో నీటితోపాటు ఎరువులను కూడా అందించుకునే అవకాశం ఉందన్నారు. దీనివల్ల రైతులకు మోతాదు లో నీరు, ఎరువులు అందిఆరోగ్యంగా పెరుగుతాయని వివరించారు. అలాగే, ఆయిల్‌పామ్ మొక్కల చుట్టూ జనుము సాగుచేసి పూతదశలో మొక్క మొదళ్లలో వేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ గెలలు విక్రయించుకునే విషయంలో రైతులు అనుమానాలు పెట్టుకోవద్దని కోరారు. అలాగే, దుగ్గొండి మండలంలోని పొనకల్‌లో బుస్సారి బాబురావు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలో ఉద్యాన అధికారి జ్యోతి రైతులకు అవగాహన కల్పించారు. చెన్నారావుపేట మండలంలోని లింగాపురంలో ఆయిల్‌పామ్ సాగుపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి సంగీత లక్ష్మి అవగాహన కల్పించారు. సంగెం మండలంలోని గవిచర్లకు చెందిన రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యాన అధికారి తిరుపతి అవగాహన కల్పించారు.

కార్మిక చట్టాల రక్షణ కోసమే సమ్మె: ఏఐటీయూసీ

వరంగల్‌చౌరస్తా: సీకేఎం ఆర్ఎంవో డాక్టర్ మురళికి సమ్మె నోటీస్ అందజేస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేశ్

వరంగల్‌చౌరస్తా/కరీమాబాద్/నర్సంపేట, మే 7: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతోపాటు తిరిగి కార్మిక చట్టాలను అమలు చేసే వరకూ కార్మికుల పోరాటం ఆగదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేశ్ అన్నారు. ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి ప్రతి కార్మికుడు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. వరంగల్ సీకేఎం హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ మురళికి బుధవారం ఆయన కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. అలాగే, వరంగల్ ఖమ్మం రోడ్డులోని సామిల్ అండ్ టింబర్ డిపో ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరాచారికి ఏఐటీయూసీ నాయకులు సమ్మె నోటీసు అందించారు. ఆల్‌ట్రేడ్స్ యూనియన్స్ ఆధ్వర్యంలో న